Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL/2024/86143

WANTED

స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం,అర్హతను భట్టి ప్రాధాన్యత ఇవ్వబడును

సంప్రదించండి సెల్ : 9440815774


Associate Editor: K L KRISHNAM RAJU | Volume: 6 | Issue : 128 | Sunday 20.04.2025 | Price : Rs.3/- | Pages : 4

అసోసియేట్ ఎడిటర్ కే ఎల్ కృష్ణంరాజు | సంపుటి : 6 | సంచిక : 128 | ఆదివారం 20. 04. 2025 | వెల : రూ.3/- | పేజీలు 4

### బారువా తీరంలో...

## తాబేళ్ల పండుగ

: కేంద్ర మంత్రి రామ్మోహన్ చేతుల మీదుగా ప్రారంభం



సోంపేట/ శ్రీకాకుళం జిల్లా, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** సర్దార్ గౌతు లచ్చన స్ఫూర్తితో బారువా బీచ్‌ను ప్రత్యేక చర్యలతో మరో గోవా తరహాలో టూరిజం స్పాట్‌గా తీర్చిదిద్దుతామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలంలోని సుందర బారువ సాగర తీరంలో మే 2, 3 తేదీల నుంచి మిగతా 2 లో

### కృష్ణవేణిని సీఐ...

## బెదిరించారు

: అంబటి రాంబాబు



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మంత్రి నారా లోకేశ్ లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్ట్ పాలేటి కృష్ణవేణి ప్రస్తుతం గుంటూరు జిల్లా జైల్లో రిమాండ్ లో ఉన్న సంగతి తెలిసిందే. జైల్లో ఉన్న కృష్ణవేణిని ములాఖత్ ద్వారా వైసీపీ నేతలు అంబటి రాంబాబు, దొంతిరెడ్డి వేమారెడ్డి, పార్టీ లీగల్ సెల్ ప్రతినిధులు కలిశారు. అనంతరం మీడియాతో అంబటి రాంబాబు మాట్లాడుతూ... పాలేటి కృష్ణవేణి పట్ల దారుణంగా వ్యవహరించిన దాచేపల్లి సీఐ పొన్నూరు భాస్కర్ పై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాయంత్రం 5 గంటలకు కృష్ణవేణిని హైదరాబాద్ లో మిగతా 2 లో

### చెల్లెమ్మకు...

## దారేదీ..?



కడప, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** వైఎస్ షర్మిల పయనమెటో తెలియడం లేదు. కాంగ్రెస్ పార్టీలో ఉండి ఆమెకు రాజకీయంగా ఎలాంటి పదవి లభించే అవకాశాలు కనిపించడం లేదు. దేశంలో ఇండి కూటమి వచ్చే సంకేతాలు అస్సలు కనిపించడం లేదు. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ లో కూడా కాంగ్రెస్ ఇక కోలుకునే పరిస్థితి లేదు. నాయకులు లేరు. క్యాడర్ లేని పార్టీని ప్రజలు ఆదరించరన్నది అందరికీ తెలిసిందే. మరొక వైపు వైఎస్ షర్మిల నాయకత్వంపై ఉన్న నేతల్లోనూ అసంతృప్తి నెలకొంది. ఆమె మీడియాకు మాత్రమే పరిమితమవుతున్నారని, పీసీసీ చీఫ్ గా పార్టీ బలోపేతానికి ఎలాంటిచర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు బలంగా వినిస్తున్నాయి. అనేక మంది కాంగ్రెస్ నేతలు ఇప్పటికే పార్టీని వీడి వెళ్లిపోతున్నారు.. అప్పుడప్పుడు హైదరాబాద్ నుంచి విజయవాడకు రావడం వైఎస్ జగన్ పై తీవ్ర స్థాయిలో విమర్శలు చేయడం, చంద్రబాబు ప్రభుత్వంపై నామమాత్రపు ఆరోపణలకు దిగుతూ ఆమె మమ అనిపించేస్తున్నారు. ఇప్పటికే ముఖ్యమైన నేతలందరూ పార్టీని వదిలి వెళ్లిపోయారు. సొంత జిల్లాలోనూ ఆమెకు గ్రిప్ దొరకడం లేదు. గత ఎన్నికల్లో జగన్ ను ఓడించగలిగానన్న తృప్తి మినహాయించి ఆమెకు రాజకీయంగా ఒరిగిందేమీ లేదు. కాంగ్రెస్ పార్టీలో తన తెలంగాణ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని విలీనం చేసినప్పుడు రాజ్యసభ పదవి ఇస్తామని చెప్పారన్న ప్రచారం జరిగింది. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ హామీ మేరకే షర్మిల ఈ స్టెప్ తీసుకున్నారని కూడా చెబుతారు. అయితే ఇప్పుడు వైఎస్ షర్మిలను కేంద్ర నాయకత్వం కూడా పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. డీకే శివకుమార్ ను ఇటీవల కలిసినప్పుడు కూడా ఆయన కూడా రాజ్యసభ విషయంలో తన మిగతా 2 లో

### ఈ-చెక్‌కి ప్రజల...

## భాగస్వామ్యం కీలకం

**ఈ-వ్యర్థాల పునరుత్పత్తితోనే మానవ మునగడ**

**స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో మంత్రి టి.జి. భరత్**

**ప్రతి ఉమ్మడి జిల్లాలో ఈ-వేస్టేజ్ ప్లాంట్‌ల ఏర్పాటుకు చర్యలు**

**ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేలా 2047 విజన్ ప్రణాళికలు**



కర్నూలు, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో ఎలక్ట్రిక్ వస్తువుల ఆవశ్యకత కీలకంగా మారిందని, అయితే అవి మానవ మనుగడకు, పర్యావరణానికి అంతే హాని చేకూర్చిస్తాయని, వాటిని పునరుత్పత్తి ద్వారా పునర్వినియోగం చేసుకుంటేనే మానవ మునగడ సాధ్యమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టి.జి. భరత్ అన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ–చెక్ (ఎలక్ట్రిక్ వ్యర్థాలు పునర్వినియోగం) అంశంపై కమిషనర్ యస్.రవీంద్ర బాబు అధ్వర్యంలో స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక కౌన్సిల్ హాలులో నిర్వహించిన మిగతా 2 లో

### విజయసాయి చరిత్ర త్వరలో...

## మొత్తం చెబుతా...

ఏపీ లిక్కర్ స్కాం కేసులో రాజ్ కసిరెడ్డిపై తీవ్ర ఆరోపణలు

ఇప్పటి వరకు రెండు సార్లు నోటీసులు ఇచ్చిన సిట్

అజ్ఞాతం నుంచి ఆడియో సందేశం వెలువరించిన రాజ్ కసిరెడ్డి



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ఏపీ లిక్కర్ స్కాం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజ్ కసిరెడ్డి తాజాగా ఓ ఆడియో సందేశం వెలువరించారు. మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి తనపై చేసిన ఆరోపణల పట్ల ఆయన ఈ ఆడియో క్లిప్పింగ్ ద్వారా బదులిచ్చారు. ఏపీ లిక్కర్ స్కాంను దర్యాప్తు చేస్తున్న సిట్ వరుస నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో, రాజ్ కసిరెడ్డి అజ్ఞాతం నుంచి ఆడియో సందేశం పంపడం మిగతా 2 లో

### అధునాతనమైన వసతులతో కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్...

## అందుబాటులోకి తెచ్చాం

రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా పటిష్ఠపరుస్తున్నాం

రాష్ట్ర వైద్య విద్య, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



కర్నూలు, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :**అధునాతనమైన వసతులతో కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ అందుబాటులోకి తెచ్చాం అని రాష్ట్ర వైద్య విద్య, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ లో ఏర్పాటు చేసిన లీనియర్ ఆక్సిలరేటర్, సి.టి.సిములేటర్ యంత్రాలు, ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్, మెడికల్ అంకాలజీ వార్డు లను రాష్ట్ర వైద్య విద్య, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, మిగతా 2 లో

### కర్నూలు ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి...

## నిరంతరం కృషి చేస్తా..

– రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్

కర్నూలు, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** కర్నూలు ప్రభుత్వాసుపత్రిని అభివృద్ధి చేసేందుకు శాయశక్తుల కృషి చేస్తున్నానని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. స్టేట్ క్యాన్సర్ ఇన్ స్టిట్యూట్లో లీనియర్ యాక్సిలరేటర్, సి.టి సిమ్యులేటర్, ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్, మెడికల్ ఆంకాలజీ వార్డులను మంత్రి సత్య కుమార్ యాదవ్ తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి టి.జి భరత్ మాట్లాడారు. క్యాన్సర్ ఆసుపత్రిని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు తన వంతు కృషి చేశానన్నారు. ఆసుపత్రిలో అన్ని విభాగాల్లో మెరుగైన సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కర్నూల్ మెడికల్ కాలేజీకి ఎంతో చరిత్ర ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎంతో మిగతా 2 లో



### కుమ్మక్కు వంటి ఆరోపణలపై...

## సిట్ దృష్టి సారించింది



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ఏపీ మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణను వేగవంతం చేసింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అనుసరించిన మద్యం విధానం, ధరల నిర్ణయం, బ్రాండ్ల ఎంపిక, మద్యం సరఫరాదారులతో కుమ్మక్కు వంటి ఆరోపణలపై సిట్ దృష్టి సారించింది. ఈ క్రమంలో పలువురు కీలక వ్యక్తులను విచారిస్తోంది. ఈ క్రమంలో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి నేడు విజయవాడలోని సిట్ కార్యాలయంలో మిగతా 2 లో

# సంపాదకీయం

## సెంట్రల్ వర్శిటీ అటవీ భూములేనా....

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వద్ద వివాదాస్పదంగా మారిన 400 ఎకరాల 'కంచ గచ్చిబౌలి' భూములపై సుప్రీం కోర్టు నియమించిన కేంద్ర సాధికార కమిటీ (సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ–సీఈసీ) నివేదిక కీలకంగా మారింది.పర్యావరణపరంగా అడవికి ఉండాల్సిన లక్షణాలన్నీ ఆ భూమికి ఉన్నాయని సీఈసీ తన నివేదికలో స్పష్టం చేసింది.ఇన్నాళ్లు ప్రభుత్వ రికార్డుల ప్రకారం, కంచ గచ్చిబౌలి భూములు 'కంచ అస్తాబల్ పోరంబోకు సర్కారీ' భూములుగా నమోదై ఉన్నాయి.సీఈసీ ఇచ్చిన నివేదికతో ఈ వ్యవహారం మరో మలుపు తిరిగే అవకాశం కనిపిస్తోంది.'కంచ గచ్చిబౌలి' భూముల వివాదంపై ఇప్పటికే సుప్రీం కోర్టులో విచారణ జరుగుతోంది.ఏప్రిల్ 16న విచారణ సందర్భంగా చెట్లను కొట్టివేసిన వంద ఎకరాల్లో పర్యావరణాన్ని ఎలా పునరుద్ధరిస్తారో చెప్పాలని సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది.తదుపరి విచారణ మే 15కు వాయిదా వేసింది.అప్పటివరకు వివాదాస్పద '400 ఎకరాల కంచ గచ్చిబౌలి' భూముల్లో ఎలాంటి కార్యకలాపాలూ జరగకుండా స్టే విధించింది.సెంట్రల్ ఎంపర్డ్ కమిటీ నివేదికపై కౌంటర్ దాఖలు చేసేందుకు సుప్రీంకోర్టు ప్రభుత్వానికి నాలుగు వారాల గడువు ఇచ్చింది.హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని ఆనుకుని ఉన్న 'కంచ గచ్చిబౌలి' భూములపై వివాదం రేగిన సంగతి తెలిసిందే.సుప్రీంకోర్టులో కేసు నమోదు కావడంతో ఏప్రిల్ 3న విచారణ మొదలైంది. చెట్ల నరికివేతను ఆపాలంటూ స్టే ఇచ్చింది. అనంతరం కేంద్ర సాధికార కమిటీని నియమించింది.ఏప్రిల్ 10న సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ సభ్యులు వివాదాస్పద 400 ఎకరాలను పరిశీలించి, సుప్రీంకోర్టుకు నివేదికను సమర్పించారు.అయితే భూమికి సంబంధించిన హక్కులను తెలంగాణ ప్రభుత్వం 2024 జులైలోనే టీజీఐఐసీకి బదలాయించింది. దీంతో టీజీఐఐసీ ఈ ఏడాది మార్చి 30న ఆ ప్రదేశంలో చెట్లను నరికివేసి భూమిని చదునుచేసే పనులు మొదలుపెట్టింది.”టీజీఐఐసీ వివరాల మేరకు 122 ఎకరాల్లో చెట్లను పూర్తిగా వేర్లతో సహా కొట్టేశారు” అని నివేదికలో సీఈసీ స్పష్టం చేసింది.వాల్టా చట్టం 2004 ప్రకారం కొన్ని మినహాయింపులున్న చెట్లను కొట్టివేయాలంటే సెల్ఫ్ డిక్లరేషన్‌తో కొట్టివేయొచ్చు. ఇందుకు ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్‌కు ఫారం 13ఏ ఇచ్చి, నిర్దేశిత ఫీజు చెల్లిస్తే సరిపోతుందని అటవీ శాఖాధికారులు సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువచ్చారు.”మార్చి 17నే టీజీఐఐసీ దరఖాస్తు చేసుకుంది. మార్చి 29న అవసరమైన పరిహారం కూడా చెల్లించింది” అని చెప్పారు.125 మినహాయింపు లేని చెట్లను కూడా కూల్చివేసినట్లుగా ఏప్రిల్ 3న చిలుకూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పరిశీలనలో గుర్తించారని సీఈసీ తన నివేదికలో పేర్కొంది.1524 చెట్లను కూల్చివేయగా.. అందులో 1399 చెట్లకు వాల్టా చట్టం నుంచి మినహాయింపులున్నాయి” అని చెప్పింది.సీఈసీ మొత్తం 69 పేజీల నివేదికను సుప్రీంకోర్టుకు ఇచ్చింది. ఇందులో కంచ గచ్చిబౌలి భూములకు 'అడవి' అని చెప్పడానికి కావాల్సిన గుణం ఉందని స్పష్టం చేసింది.”ప్రాథమిక పరిశీలన ప్రకారం, ఆ ప్రాంత సహజ లక్షణం, పర్యావరణ పరంగా అడవిని తలపిస్తోంది” అని నివేదికలో పలుమార్లు ప్రస్తావించింది.”ఈ ఏడాది మార్చి 4న అటవీ లక్షణాలు కలిగిన భూములు గుర్తించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు విరుద్ధంగా చదును చేసే పనులు చేపట్టారు. వన చట్టం 2023ను పట్టించుకోకుండానే టీజీఐఐసీ చదును చేసే పనులు మొదలుపెట్టింది” అని సీఈసీ తన నివేదికలో పేర్కొంది.అలాగే టీజీఐఐసీ కూడా డీపీఆర్ సిద్ధం చేయకుండా నేరుగా అడవి వంటి లక్షణాలు కలిగిన ఆ భూమిని చదును చేయడానికి ముందుకెళ్లిందని సీఈసీ అభిప్రాయపడింది.హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 1975లో దాదాపు 2324 ఎకరాలను కేటాయించింది . విశాలమైన ప్రాంతం కావడంతో ఇదంతా పచ్చదనం, చెట్లతో నిండి ఉంటుంది. జింకలు, నెమళ్లు కనిపిస్తుంటాయి.సీఈసీ తన నివేదికలో ఇదే అభిప్రాయం వ్యక్తం చేసింది.” ఈ ప్రాంతం పర్యావరణం, పచ్చదనం పరంగా ఉన్నతంగా ఉంది. రాళ్ల అమరికలు, కుంటలు, జీవవైవిధ్యం కారణంగా అక్కడ ఏదైనా పనులు చేయాలంటే కచ్చితంగా గట్టి పరిశీలన జరగాలి. అటవీ చట్టాల ప్రకారం అక్కడ ఎలాంటి చర్యలు తీసుకోవడమైనా సరే, నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుంది.టీజీఐఐసీ తమకు యాజమాన్య హక్కులు ఉన్నట్లుగా చెబుతున్నప్పటికీ, అన్ని అనుమతులూ తీసుకోలేదు. భూమిని మార్టిగేజ్ చేయడం కూడా ఆర్థికంగా తీవ్రమైన ఉల్లంఘనగా భావించాలి” అని చెప్పింది.ఈ భూమిని బీకాన్ ట్రస్టీషిప్ లిమిటెడ్ పేరుతో మార్టిగేజ్ చేసి నాన్–కన్వర్టబుల్ బాండ్లు జారీ చేసినట్లుగా తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏప్రిల్ 10న సీఈసీకి ఇచ్చిన నివేదిక ద్వారా స్పష్టమవుతోంది.దీనిపై సుప్రీంకోర్టు ఏప్రిల్ 16న తన విచారణ సందర్భంగా స్పందించింది.”భూమిని మార్టిగేజ్ చేశారా లేదా.. అనే విషయం జోలికి మేం వెళ్లదలుచుకోలేదు. మేం జీవ వైవిధ్యం గురించి మాట్లాడుతున్నాం” అని స్పష్టం చేసింది.సుప్రీంకోర్టు తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు ఎలాంటి పనులూ మొదలుపెట్టకూడదుక్షేత్రస్థాయి అటవీ శాఖాధికారులు, వన్యప్రాణుల నిపుణులు, పర్యావరణవేత్తలు, ఐటీ, రిమోట్ సెన్సింగ్ నిపుణులు, సర్వే సంస్థ ప్రతినిధులతో కమిటీ వేసి అటవీ తరహా ప్రాంతాలను గుర్తించాలి.అటవీ చట్టం 2023 ప్రకారం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పర్యావరణ పరంగా ఇబ్బంది లేకుండా భూములను విభజించేందుకు ప్రత్యేక నిబంధనలు రూపొందించాలి.

సరైన పర్యావరణ నిబంధనలు పాటించకపోవడంతోపాటు 2006నాటి పర్యావరణ ప్రభావిత అంచనా అనుమతులు కూడా తీసుకోలేదు. టీజీఐఐసీ అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. టీజీఐఐసీకి ఇచ్చిన అనుమతిని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి రద్దు చేయాలి.వివాదాస్పద 400 ఎకరాలు సహా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రాంతాన్ని పర్యావరణ సెన్సిటివ్ జోన్‌గా ప్రకటించి వైల్డ్ లైఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా వంటి సంస్థలతో సమగ్ర అధ్యయనం చేయించే వరకు అక్కడ ఎలాంటి అభివృద్ధి కార్యకలాపాలు జరగకుండా నిరోధించాలి.సుప్రీంకోర్టుకు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తన నివేదికను సమర్పించారు.400 ఎకరాల్లో పర్యావరణ అనుకూల ఐటీ పార్కు అభివృద్ధి చేయాలనేది ప్రభుత్వ ఆలోచన అని పేర్కొన్నారు.”కంచ గచ్చిబౌలి ప్రాంతంలో 2374.02 ఎకరాల భూమి ఉంది. 2003లో అప్పటి ప్రభుత్వం స్పోర్ట్స్ కోచింగ్ అకాడమీ కోసం ఐఎంజీ భారత అకాడమీ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించింది. తర్వాత కేటాయింపు రద్దు చేసింది. దీనిపై ఐఎంజీ భారత్ హైకోర్టుకు వెళ్లగా.. 2024 మేలో ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చింది” అని ప్రభుత్వం తన నివేదికలో ప్రస్తావించింది.”20 ఏళ్లుగా ఖాళీగా ఉండటంతో చెట్లు, పొదలు పెరిగాయి. పక్కనే హెచ్‌సీయూలో ఉండే నెమళ్లు, జింకలు అక్కడికి వస్తున్నాయి. ఈ ప్రాంతంలో చిలుకల కుంట ఉంది. దాన్ని పరిరక్షించాలని నిర్ణయం తీసుకున్నాం” అని ప్రభుత్వం స్పష్టం చేసింది.నకిలీ చిత్రాలు, వీడియోలతో కంచ గచ్చిబౌలి భూములపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సుప్రీంకోర్టుకు వివరించారు .నకిలీ ఫొటోలు, వీడియోలుగా పేర్కొంటూ కొన్నింటిని ప్రభుత్వం సుప్రీంకోర్టుకు సమర్పించింది.అయితే, వంద ఎకరాల్లో పచ్చదనం లేదా పర్యావరణాన్ని పునరుద్ధరించేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు స్పందించారు.”ఆ భూమి ప్రభుత్వానిదేనని గతంలోనే సుప్రీంకోర్టు చెప్పింది. ప్రస్తుతం సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను పాటిస్తాం” అని మీడియాతో జరిగిన చిట్‌చాట్‌లో చెప్పారు.

# అధునాతనమైన వసతులతో కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్...

ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ కలిసి ప్రారంభించారు..ఈ సందర్భంగా కాన్సర్ ఇన్స్టిట్యూట్ లోని అన్ని వార్డులను పరిశీలించి, దాదాపు రెండు గంటల సమయం పైగా రోగులతో ముచ్చటిస్తూ గడిపారు.. కేన్సర్ నివారణ విభాగము , అత్యవసర విభాగం, మెడికల్ ఆంకాలజీ వార్డ్ లను పరిశీలిస్తూ అక్కడే ఉన్న రోగులు తిప్పమ్మ, రాజేశ్వరి, సుప్రియ, చిన్నప్ప, రాజు లతో మాట్లాడుతూ వైద్యం ఏ విధంగా అందుతోంది, డాక్టర్లు బాగానే చూసుకుంటున్నారా, మీకు ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని రోగులను అడిగి తెలుసుకున్నారు.. అనంతరం సూపర్ స్పెషాలిటీ లోని కార్డియో థోరాసిక్ వ్యాస్కులర్ సర్జరీ వార్డు ను పరిశీలిస్తూ బై పాస్ సర్జరీ చేయించుకున్న వారితో మాట్లాడుతూ వారి ఫీడ్ బ్యాక్ ను మంత్రి తీసుకున్నారు..రోగులు స్పందిస్తూ, డాక్టర్లు వైద్య సేవలు చాలా బాగా అందిస్తున్నారని, సమస్యలు లేవని చెప్పడంతో మంత్రి సంతోషించారు.. అనంతరం విలేకరులతో మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఏ ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో లేని విధంగా కేన్సర్ ఇన్స్టిట్యూట్ లో 28 కోట్ల రూపాయల విలువ గల అత్యాధునిక లీనియర్ ఆక్సిలరేటర్ ను, దాదాపుగా 2 కోట్ల 50 లక్షల రూపాయలు విలువ చేసే అనేక రోగ నిర్ధారణ పరికరాలను కూడా ప్రారంభించామన్నారు.. తద్వారా రాష్ట్రంలో అధునాతమైన క్యాన్సర్ చికిత్స కర్నూలు లో అందబోతుందన్నారు. ఇప్పటికే కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల వైద్య రంగంలో విశిష్టమైన సేవలు అందిస్తోందన్నారు... సర్జికల్ ఆంకాలజీ, జనరల్ ఆంకాలజీ లలో ఊహకు అందని సర్జరీలను వైద్యులు చేశారన్నారు.. 14 సంవత్సరాల అమ్మాయికి అత్యాధునిక బ్రెయిన్ సర్జరీ చేశారన్నారు.. ఈ విధంగా అత్యాధునిక పద్ధతిలో వైద్యులు అనేక సర్జరీలు చేశారన్నారు..వార్డులను పరిశీలించి రోగులను పరామర్శిస్తున్న సమయంలో వారు వైద్యులు అందిస్తున్న సేవలుపట్ల చాలా సంతృప్తి వ్యక్తం చేశారని మంత్రి పేర్కొన్నారు. వైద్యులు రోగులకు అందిస్తున్న సేవలు చాలా బాగున్నాయని మంత్రి వైద్యులను వైద్య సిబ్బందిని అభినందించారు.. ఇదే విధంగా రోగులకు అందించే వైద్య సేవలను కొనసాగించాలని మంత్రి సూచించారు.. రాష్ట్రంలోనే గర్వించదగ్గ వైద్య సంస్థగా, వైద్య కళాశాలగా కర్నూలు ఆస్పత్రిని తీర్చిదిద్దేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. సంవత్సరం కిందట సమీక్ష నిర్వహించినప్పుడు వైద్య రంగంలో అనేక కొరతలు కనిపించాయన్నారు.. ప్రధానంగా డాక్టర్ల కొరత ఉండేదని, 40 శాతం డాక్టర్ల కొరత ఉంటే ఇటీవలే రీడిప్లాయిమెంట్ చేయడం జరిగిందన్నారు.. అందులో భాగంగా ఆదోని, ఇతరత్రా ప్రాంతాల నుండి డాక్టర్లను, బోధన సిబ్బందిని కర్నూలుకి తీసుకొని వస్తే కేవలం 6 నుండి 7 శాతం మాత్రమే టీచింగ్ స్టాఫ్ కొరత ఉందన్నారు.. అసిస్టెంట్ ప్రొఫెసర్ లు, కింది స్థాయిలో ఇంకా కొరత ఉందని వాటిని రిక్రూట్మెంట్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.. గత ప్రభుత్వం రిక్రూట్మెంట్ జీరో వేకెన్సీ పాలసీ అని చెప్పారు కానీ సిబ్బంది నియామకంలో చాలా కొరత ఉందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా పటిష్టపరిచే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ అంశంపై రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా తరచూ సమీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. 2018 సంవత్సరంలో కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఉన్న సమయంలో కేంద్రం నుండి 60 శాతంతో రాష్ట్రం నుండి 40 శాతంతో 120 కోట్ల రూపాయలతో స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ మంజూరు అయిందన్నారు... ఐతే కేంద్రం నుండి నిధులు విడుదల అయినప్పటికీ పనులు మొదలు పెట్టకుండా గత ప్రభుత్వం ఐదు సంవత్సరాలు కాలయాపన చేశారన్నారు.. రాయలసీమలో చాలామంది పేద ప్రజలు ఉన్నారని, క్యాన్సర్ కేసులు ఏటా పెరుగుతూ పోతున్నాయన్నారు.. 2022 సంవత్సరంలో 73 వేల కొత్త క్యాన్సర్ కేసులు వస్తే అందులో 41 వేల మంది ప్రాణాలు కోల్పోయారన్నారు..అయినా కూడా గత ప్రభుత్వం కేన్సర్ ఇన్స్టిట్యూట్ పై శ్రద్ధ పెట్టలేదన్నారు.అధునాతమైన వైద్య సేవలు అందించడానికి డాక్టర్లు సిద్ధంగా ఉన్నారని, వారికి ఇన్ఫ్రా స్ట్రక్చర్, ఎక్విప్మెంట్, సర్జికల్ ఫెసిలిటీ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందన్నారు..కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ పై ప్రత్యేక శ్రద్ధ వహించి సమీక్షలు నిర్వహించుకుని 3 నెలల పాటు ఏమి కొరతలు ఉన్నాయని విషయాలను గుర్తించేందుకుగాను ఒక ఏడిఎమ్ఈ ని నియమించడం జరిగిందన్నారు.. 45 కోట్ల రూపాయలు విలువైన అధునాతమైన పరికరాలకు 3 నెలల్లో సమకూర్చామన్నారు.. అదే విధంగా మౌలిక సదుపాయాలను కూడా కల్పించామన్నారు.. కొంతమంది ప్రత్యేక బోధన సిబ్బంది రావాల్సి ఉందని, వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు.. మార్చి 30 వ తేది నాటికి క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ మౌలిక సదుపాయాలు పూర్తి చేసుకుని, టెక్నీషియన్లు డాక్టర్లు స్పెషలిస్టులు సూపర్ స్పెషలిస్టులు కూడా అందుబాటులోకి రావాలని లక్ష్యాన్ని పెట్టడం జరిగిందని, కానీ మార్చి 4 వ తేదీకే నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తిచేసి ట్రైల్ బేస్ మీద అనేక రకాలైన సర్జరీలు చేసి ఉచితంగా వైద్య సేవలు అందించారన్నారు.. ఈ విధంగా సేవాభావం అంకితభావం ఉన్న డాక్టర్లు ఉన్నప్పుడు వారిని మోటివేట్ చేసి వారికి కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ విషయాలను గత ప్రభుత్వం మరిచినప్పటికీ మన కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైద్య రంగంపై రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు సమీక్షలు నిర్వహించి వైద్యులకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు.. కేంద్ర ప్రభుత్వం నుండి వైద్య రంగానికి సంబంధించి సహాయ సహకారాలు అందుతున్నాయన్నారు.. ప్రత్యేకించి వైద్య రంగానికి 15 వ కమిషన్ కింద నిధులు వస్తున్నాయన్నారు.. ఆయుష్మాన్ భారత్ హెల్త్ మిషన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కింద కూడా పెద్ద ఎత్తున నిధులు లభిస్తున్నాయన్నారు. కింది స్థాయి పీహెచ్సీ నుండి కూడా వైద్య సేవలు పటిష్టంగా అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.. క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ లో కేవలం ఆంధ్రప్రదేశ్ కి సంబంధించిన రోగులే కాకుండా కర్ణాటక, తెలంగాణ నుండి వచ్చి ట్రీట్మెంట్ తీసుకుంటున్నారని మంత్రి పేర్కొన్నారు.ప్రైవేట్ ఆస్పత్రులలో 20 నుండి 25 లక్షల వరకు అందించే వైద్యాన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా అందిస్తున్నారని విషయాన్ని అదేవిధంగా రోగులను వైద్యులు కుటుంబ సభ్యులుగా చూసుకుంటున్నారని విషయాన్ని ప్రజలలోకి తీసుకొని వెళ్లాల్సిన బాధ్యత మీడియాపై ఉందని మంత్రి సూచించారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, ఏపీఎంఎస్ఐడి సి చైర్మన్ శ్రీనివాసరావు , జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య,అకడమిక్ డి ఎం ఈ డా.రఘునందన్, జి జి హెచ్ సూపరింటెండెంట్ డా .వెంకటేశ్వర్లు,మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా.చిట్టి నరసమ్మ, కేన్సర్ ఇన్స్టిట్యూట్ వైద్యులు, వివిధ కార్పొరేషన్ ల చైర్మన్లు,డైరెక్టర్లు,వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఈ-చెక్‌కి ప్రజల...

ప్రత్యేక కార్యక్రమాలకు మంత్రి టి.జి. భరత్, జాయింట్ కలెక్టర్ బి.నవ్య హాజరయ్యారు. ముందుగా ఆవరణలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ వ్యర్థాల స్టాల్స్‌ను పరిశీలించి, అనంతరం కౌన్సిల్ హాల్లో పారిశుధ్య తనిఖీదారులు, శానిటేషన్ సెక్రటరీలతో సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో ప్రసంగాల అనంతరం ఈ–వేస్టేజ్ పోస్టర్లను ఆవిష్కరించి, హాజరైన సిబ్బందిచే కమిషనర్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఈ–వేస్ట్ సేకరణ మొబైల్ వాహనాన్ని ప్రారంభించి, ఈ–చెక్ గ్రీన్ వాక్ ర్యాలీ నిర్వహించారు. అలాగే ఆశోక్ నగర్ కే.సి. కెనాల్ వద్ద పాకేట్ పార్క్ వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇటీవల అమరావతిలో ఓ కంపెనీ ప్రతినిధులతో రాష్ట్రంలో ప్రతి ఉమ్మడి జిల్లాలో ఈ–వేస్టేజ్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు, వాటి ద్వారా ఆదాయం సైతం సమకూరేలా ముఖ్యమంత్రి చంద్రబాబు యోచిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇవి వచ్చేంత వరకు రెడ్యూస్ రియూజ్ రిసైక్లింగ్ సెంటర్లకు, ప్రజలు ఈ వ్యర్థాలను అందించాలని కోరారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు, లక్ష్యాలు ప్రతిబింబించేలా విజన్–2047 ప్రణాళికలను ప్రభుత్వం రూపొందించి, పకడ్బందీగా అమలు చేస్తోందన్నారు. ఎలక్ట్రిక్ వ్యర్థాలు మానవాళికి, పర్యావరణానికి ముప్పు కలగనీయకుండా ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని, కార్పొరేటర్లు, అధికారులు, నాయకులు ప్రజల్లో చైతన్యం కలిగించాలని కోరారు. కాలువల్లో, నదుల్లో వ్యర్థాలను వేయడం ద్వారా తిరిగి మానవాళిపైనే ప్రభావం చూపుతాయని, అటువంటి పొరపాట్లు చేయకుండా ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. గత ప్రభుత్వం వేసిన చెత్త మీద పన్నును కూటమి ప్రభుత్వం తొలగించడం జరిగిందని, నగరంలో పారిశుధ్యంపై టార్గెట్లు పెట్టుకుని పని చేస్తున్నామని వెల్లడించారు. నగరంలో వేసవి ఎండ తీవ్రత నుండి విముక్తి పొందేందుకు పచ్చదనం పెంపు, క్రీడా రంగ అభివృద్ధి, తదితర అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల నుండి నిధులు రాబట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని, గత ప్రభుత్వం చేసిన జరిగిన తప్పిదాలను సరిచేసుకుంటూ వీటన్నింటినీ నెరవేర్చేందుకు కృషి చేస్తామని మంత్రి తెలిపారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, ప్రతి నెల మూడో శనివారం ఒక కొత్త నినాదం అమలులోకి తీసుకొని వస్తుందని, దాన్ని సమాజంలో అమలు పరచవలసిన బాధ్యత మనపై ఉందన్నారు. పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడానికి, ఈ కొత్త జనరేషన్లో మనకు ఎదురైతున్న సమస్యలు ఈ వేస్ట్, కెమికల్స్, ప్లాస్టిక్ , ఇవన్నీ ఎక్కువగా జనరేట్ అవుతున్నాయని, అయితే వీటన్నిటిని ఛాలెంజ్‌గా తీసుకుందన్నారు. వీటిని ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను ప్రభుత్వం అన్వేషించి, ప్రతి నెల ఒక నినాదంతో పర్యావరణాన్ని పరిశుభ్ర కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని పేర్కొన్నారు. మార్చి నెలలో సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను ఎలా నివారించుకోవాలి అనే దాని పైన ఏప్రిల్ మాసంలో ఈ వేస్ట్ పైన వాటిని ఏ విధంగా నివారించుకోవాలి అనేది ఈ నెల నినాదం భూమిలో కరిగిపోయేటువంటి వస్తువులు పర్యావరణానికి ఇబ్బంది కలిగించవు, భూమిలో కరిగిపోనటువంటి వస్తువులు ఇబ్బందులు కలిగిస్తాయి కావున వీటిని వాడకము కూడా వీలైనంతవరకు తగ్గించుకోవాలి అని అన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులు మానవాళికి నిత్యం వినియోగ పడుతున్నాయి, వాటిని డిస్పోస్ చేయడంపై కూడా ఆలోచించవలసిన అవసరం ఉంది అని అన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులు సెల్ఫోన్, కంప్యూటర్స్ ఇవన్నీ మానవుని జీవితంలో ఒక భాగం అయినాయి, వీటి లైఫ్ టైమ్ తర్వాత పర్యావరణానికి హాని కలగకుండా వాటి డిస్పోస్ చేసుకోవాలన్నారు. ఇలాంటి వాటికోసం ప్రభుత్వం మున్సిపల్ కార్పొరేషన్ లలో గ్రామ పంచాయతీలలో ఆర్ఆర్ఆర్ రెడ్యూస్, రియూజ్డ్ , రీసైకిల్ సెంటర్స్ ఏర్పాటు కోవాలని చెప్పిందని జాయింట్ కలెక్టర్ అన్నారు. ఈ వేస్ట్ కలెక్ట్ సెంటర్లు ఉంటాయి. వాటి యందు కరెంటు బల్బులు, పనికిరానిమొబైల్స్,నిరుపయోగమైనటువంటి కంప్యూటర్స్ వాటన్నిటిని ఆ సెంటర్లలో అందజేయాలన్నారు. ఇలాంటి వాటి పైన ఎస్ హెచ్ జి గ్రూపులకు అవగాహన కొరకు శిక్షణ కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆర్ ఆర్ ఆర్ సెంటర్ లకు వచ్చిన వేస్టేజ్ అంత కొన్ని సంస్థ లకు అప్పజెప్పడం జరుగుతుందన్నారు. వారు వాటిని హాని కలగకుండా డిస్పోస్ చేస్తారని అన్నారు. ప్రస్తుతం కార్యాలయాల్లో, గృహాల్లో కూడా ఈ వేస్ట్ జనరేట్ అవుతోంది వాటన్నిటిని కూడా ఈ వేస్ట్ కేంద్రాలకు పంపించాలని వీటి కొరకు ఈ వేస్ట్ సేకరణ మొబైల్ వాహనాలు కూడా ఇంటింటికి తిరుగుతాయని అందరూ సహకరించి ఈ వేస్ట్ ను ఈ వాహనానికి అందించాలని జాయింట్ కలెక్టర్ గారు అన్నారు. ఇవే కాకుండా సాలిడ్ వేస్ట్ సెంటర్లు ఇప్పుడు బాగా రన్ అవుతున్నాయని, ముఖ్యంగా ఇంటిలోని తడి చెత్త పొడి చెత్తను కచ్చితంగా వేరుచేసి వచ్చిన పారిశుధ్య కార్మికులకు అందించినట్లయితే సాలిడ్ వేస్ట్ ప్రాసెస్ చేస్తారని దాని ద్వారా కంపోస్ట్ ఎరువులను తయారు చేసుకొని వాటిని మరలా ఉపయోగించుకోవచ్చు అని జాయింట్ కలెక్టర్ అన్నారు. ఇవన్నీ విజయవంతంగా జరగాలంటే ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛంద – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములై ముందుకు సాగాలని జాయింట్ కలెక్టర్ పిలుపునిచ్చారు. కమిషనర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర సాధనకు అనేక కార్ర్యమాలకు శ్రీకారం చుట్టిందని, అందులో స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం ఒకటన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు గతంలో పని చేసినప్పుడు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమానికి నాంది పలికారని, తాజాగా ఇప్పుడు స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం శ్రీకారం చుట్టారన్నారు. స్వర్ణాంధ్రకు సాధనకు మొదట రాష్ట్రం స్వచ్ఛతతో ఉండాలనే ఉద్దేశ్యంతో, ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ హితం కోసం ప్రజలందరూ పాటు పడాలని కోరారు. ప్రతి నెల మూడో శనివారం, ఒక అంశంతో ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు శ్రీకారం చుట్టిందన్నారు. వ్యర్థాలను నగరపాలక సంస్థకు అందిస్తేనే, మానవాళి మనుగడ, పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్ రెడ్డి, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ ఈఈ పి.వి. కిశోర్ రెడ్డి, ఎంఈలు సత్యనారాయణ, శేషసాయి, టిపిఆర్ఓ వెంకటలక్ష్మి, కార్పొరేటర్ కురువ పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలు ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి...

మంది పేరొందిన డాక్టర్లు కర్నూల్ మెడికల్ కాలేజీలోనే చదివారన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన సేవలు అందించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తన శాఖకు పూర్తిస్థాయిలో న్యాయం చేసేందుకు మంత్రి సత్య కుమార్ యాదవ్ ఎంతో కష్టపడుతున్నారన్నారు. కార్పొరేట్ హాస్పిటల్ కు దీటుగా కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలందించేందుకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రిని నెలకు లేదా రెండు నెలలకు ఒకసారి తప్పకుండా విజిట్ చేయాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రిని.. మంత్రి టి.జి భరత్ కోరారు.



# బారువా తీరంలో...

బీచ్ ఫెస్టివల్స్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బారువా తీరం ఒక అద్భుత వేడుకకు వేదిక కానుందని, ఇది రెండో గోవా రీతిలో తలపించేట్టుగా అన్ని రకాల హంగులతో అభివృద్ధి చేస్తామని అన్నారు. స్థానికుల సహకారంతో ప్లాస్టిక్ రహిత బీచ్‌గా తీర్చిదిద్ది, అన్ని రాష్ట్రాల ప్రజలకు గొప్ప పర్యాటక కేంద్రంగా బారువ సముద్రతీరాన్ని తీర్చిదిద్దటమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అన్నారు.

ప్లాస్టిక్ రహితంగా చేస్తే మరింత అభివృద్ధి. స్థానిక ప్రజలు ప్లాస్టిక్ రహిత బీచ్‌గా తీర్చిదిద్దినప్పుడే ఈ ప్రాంతానికి సీఎం చంద్రబాబుని తీసుకువచ్చి అన్ని విధాలుగా అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి రామ్మోహన్ అన్నారు. ఉదయం ఒలివ్ రిడ్లీ తాబేలు ఉత్సవంలో పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో తాబేలు పిల్లలను సముద్రంలోకి విడిచిపెట్టి ప్రకృతి ప్రేమికులకు, పర్యావరణ కార్యకర్తలకు ప్రత్యేక అనుభూతిని పరిచయం చేశారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆలోచనతో రూపుదిద్దుకున్న ఈ కార్యక్రమాన్ని అటవీ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

**సాగర తీరంలో పండుగ సందడి :** ఫ్రమ్ షోర్ టూ సీ – ఏ జర్నీ టూ సెలెబ్రేట్ అనే స్ఫూర్తిదాయక నినాదంతో బీచ్ లోపల ఆటలు పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అంతరించిపోతున్న ఒలివ్ రిడ్లీ తాబేళ్ల ప్రాముఖ్యతను ప్రజా ప్రతినిధులు అధికారులు వివరించారు. ఈ ఉత్సవం కేవలం ఒక వేడుక మాత్రమే కాదని భావితరాలకు అందించే అడుగని జీవావరణాన్ని కాపాడవలసిన బాధ్యత అందరిపై ఉందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సంప్రదాయ పడవ పోటీల్లో లోకల్ మత్స్యకారులు నైపుణ్యాన్ని చాటుకున్నారు. బీచ్ వాలీబాల్ పోటీలు ఉత్సాహాన్ని నింపాయి. తీర ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజా ప్రతినిధులు అధికారులు తీరంలో ప్లాస్టిక్ కవర్లు, చెత్తను సేకరించి ప్లాస్టిక్ రహిత సముద్రతీరంగా తీర్చిదిద్దాలని స్థానికులకు విజ్ఞప్తి చేశారు

# కృష్ణవేణిని సీఐ...

అరెస్ట్ చేసి దాచేపల్లికి తీసుకెళ్లారని... మరుసటి రోజు ఉదయం వరకు స్టేషన్ లోనే ఉంచి కనీసం ఆహారం కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. కృష్ణవేణి పట్ల సీఐ భాస్కర్ అసభ్యకరంగా మాట్లాడారని అంబటి అన్నారు. వైసీపీ నేతల పేర్లు చెప్పమని కృష్ణవేణిని హింసించారని... చెప్పినట్టు వినకపోతే కృష్ణవేణి భర్తపై గంజాయి కేసు పెడతానని బెదిరించారని మండిపడ్డారు. కృష్ణవేణిపై వ్యభిచారం కేసు కూడా పెడతానని భయపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో పోస్ట్ పెడితే వ్యభిచారం కేసు పెడతానని బెదిరించడం ఏమిటని ప్రశ్నించారు. సీఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# విజయసాయి చరిత్ర త్వరలో...

సంతరించుకుంది. ఆడియో క్లిప్పింగ్ లో రాజ్ కసిరెడ్డి ఏమన్నారంటే... “లిక్కర్ స్కాం కేసుకు సంబంధించి సిట్ అధికారులు నాకు రెండు సార్లు నోటీసులు పంపారు. నాపై వచ్చిన ఆరోపణల పట్ల నేను న్యాయపరంగా పోరాటం చేస్తున్నా. సిట్ నోటీసులపై న్యాయస్థానాన్ని ఆశ్రయించాను. నిర్ణీత సమయం ఇచ్చి నోటీసులు ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. న్యాయపరమైన రక్షణ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించాను. ముందస్తు బెయిల్ కోసం కూడా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాను. ప్రస్తుతం సుప్రీంకోర్టు ఉత్తర్వుల కోసం ఎదురుచూస్తున్నా. మద్యం కుంభకోణంతో నాకు ఎలాంటి సంబంధం లేదు. నాపై విజయసాయిరెడ్డి చేసిన ఆరోపణల్లో నిజం లేదు. న్యాయపోరాటం ముగిశాక మీడియాను పిలిచి విజయసాయిరెడ్డి చరిత్ర మొత్తం చెబుతా” అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రాజ్ కసిరెడ్డి... విజయసాయిని 'బట్టేబాజ్ మనిషి' అని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో ఒకవైపు వాదనలు విని మీడియాలో వార్తలు ప్రసారం చేయొద్దని, తన వాదన కూడా వినాలని, త్వరలోనే మీడియా ముందుకు వచ్చి విజయసాయి వ్యవహారంతో సహా అన్ని విషయాలు చెబుతానని వెల్లడించారు. కాగా, సిట్ నోటీసులకు తాను స్పందించానని రాజ్ కసిరెడ్డి వెల్లడించారు. నోటీసులపై తన న్యాయవాదులను సంప్రదించగా, సిట్ మిమ్మల్ని సాక్షిగా పేర్కొంటోందని, అయితే అరెస్ట్ చేసే అవకాశముందని వారు చెప్పారని వివరించారు. తనకు సిట్ రెండుసార్లు నోటీసులు ఇచ్చిందని కసిరెడ్డి ఆడియోలో అంగీకరించారు. మొదటి నోటీసు తాను లేని సమయంలో తన తల్లికి ఇచ్చారని, రెండో నోటీసు మెయిల్ ద్వారా పంపి మరుసటి రోజే విచారణకు రమ్మన్నారని తెలిపారు. విచారణకు సహకరించడానికి తాను సిద్ధంగా ఉన్నానని, అయితే తనను ఎందుకు విచారణకు పిలుస్తున్నారో స్పష్టం చేయాలని సిట్ ను కోరినట్లు తెలిపారు.

# కుమ్మక్కు వంటి ఆరోపణలపై...

విచారణకు హాజరయ్యారు. అధికారులు ఆయన్ను సుదీర్ఘంగా ప్రశ్నించారు. శనివారం ఉదయం సిట్ కార్యాలయానికి చేరుకున్న మిథున్ రెడ్డిని, అధికారులు దాదాపు ఎనిమిది గంటల పాటు విచారించారు. ఈ సుదీర్ఘ విచారణలో భాగంగా, మద్యం కుంభకోణానికి సంబంధించిన పలు కీలక అంశాలపై, ముఖ్యంగా కొన్ని డిస్టిలరీలకు అనుకూలంగా వ్యవహరించారన్న ఆరోపణలపై సిట్ అధికారులు ఆయన్ను ప్రశ్నించినట్టు తెలుస్తోంది. ముఖ్యంగా రాజ్ కసిరెడ్డికి చెందిన ఆదాన్ డిస్టిలరీ, డికార్ట్ నుంచి ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ చేసిన కొనుగోళ్లు... రాజ్ కసిరెడ్డితోనూ, ఆయన అనుచరులు చాణక్యరాజ్, అవినాశ్ రెడ్డిలతో ఉన్న సంబంధాలపైనా మిథున్ రెడ్డిని సిట్ అధికారులు ప్రశ్నించినట్టు తెలుస్తోంది. వారితో ఆర్థిక లావాదేవీలపైనా కూపీ లాగే ప్రయత్నం చేశారు. అయితే మిథున్ రెడ్డి కొన్ని ప్రశ్నలకే సమాధానం చెప్పినట్టు సమాచారం. విచారణ అనంతరం మిథున్ రెడ్డి నుంచి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసి, దానిపై ఆయన సంతకాన్ని తీసుకున్నారు. కోర్టు ఆదేశాల మేరకు మిథున్ రెడ్డిని న్యాయవాది సమక్షంలో విచారించారు.

# చెల్లెమ్మకు...

నిస్సహాయతను వ్యక్తం చేసినట్లు సమాచారం. ఏమీలేని రాష్ట్రంలో చీఫ్ గా ఉన్న నేతకు రాజ్యసభ పదవి ఇవ్వడం అనవసరమని బహుశ కేంద్ర నాయకత్వం భావించి ఉండవచ్చు. కాంగ్రెస్ లో సీనియర్ నేతలు అనేక మంది ఉన్నారు. రాహుల్ గాంధీ, సోనియాకు అత్యంత ఆప్తులైన నేతలు అనేక మంది పెద్దల సభలో తమకు స్థానం దక్కుతుందని భావిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో టెన్ జన్ పథ్ వైఎస్ షర్మిల వైపు చూసే అవకాశాలు కనిపించడం లేదు. ఇప్పుడు కాదు కదా.. వచ్చే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ లో కనీసం ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకునే అవకాశాలు కనిపించడం లేదు. పదిహేనేళ్లన నుంచి అంటే 2014 రాష్ట్ర విభజన జరిగిన తర్వాత కాంగ్రెస్ పార్టీ కోలుకునే పరిస్థితి లేదు. ఇక కోలుకోనే అవకాశాలు కూడా లేవు. టీడీపీ, వైసీపీ వంటి బలమైన పార్టీలు కూడా కాంగ్రెస్ ను కలుపుకుని పోయేందుకు ప్రయత్నించవు. అందుకే తమకు దగ్గరగా ఉన్న ఏమీ ఓటు బ్యాంకులేని కాలం చెల్లిన సిద్ధాంతాలతో పయనిస్తున్న కమ్యూనిస్టులతోనే ప్రయాణం సాగించాల్సి ఉంటుంది. అందుకే వైఎస్ షర్మిలకు రాజకీయ భవిష్యత్ కనుచూపు మేరలో కనిపించడం లేదు. ఆమె మరి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది చూడాలి.

## స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమం



శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 19: శ్రీకాళహస్తి శనివారం ఎన్టీఆర్ పార్కు నందు స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమం శ్రీకాళహస్తి డి.ఎస్.పి నరసింహ మూర్తి వారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది. ఇందులో భాగంగా పార్కు పరిసర ప్రాంతాలలో ప్లాస్టిక్ వ్యర్థములను,చెత్తను ఊడ్చి శుభ్రపరచడం జరిగినది. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పోలీసు అధికారులు,మునిసిపాలిటీ సిబ్బంది , ప్రజలు పాల్గొనడం జరిగినది.

## స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛభారత్ కార్యక్రమం



వెదురు కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 19: చిత్తూరు జిల్లా వెదురు కుప్పం మండలం పెరుమాళ్ళపల్లి పంచాయతీలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా శనివారం రోజు గ్రీన్ అంబాసిడర్ తో కలిసి చెత్త మరియు ఎలక్ట్రానిక్ వస్తువులను స్వీకరించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన స్థానిక సర్పంచ్ బండి శశి ఆనంద రెడ్డి సెక్రటరీ కే ధనలక్ష్మి మరియు సచివాలయ సిబ్బంది గ్రామ ప్రజలు ఫీల్డ్ అసిస్టెంట్లు అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగినది.

## డాక్టర్ రాహుల్ యువసేన జెర్సీ (టీ షర్ట్స్)....
## ఆవిష్కరించిన డాక్టర్ రాహుల్




ఎస్ఆర్ పురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 19: గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ యంగ్ అండ్ డైనమిక్ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ తనయుడు డాక్టర్ రాహుల్ యువసేన జెర్సీ టీషర్టులను శనివారం ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ టిడిపి యువ నాయకుడు ఎన్ఎస్ రాజు పవన్ పాల్గొన్నారు.

## మెకానిక్ మహబూబ్ బాషా కుటుంబాన్ని పరామర్శించి .....
## ఆర్థిక సహాయం అందించిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 19: మెకానిక్ మహబూబ్ బాషా కుటుంబాన్ని పరామర్శించి ఆయన అమృతదేహానికి సంతాపం తెలియజేయడం జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.3 లక్షల నష్టపరిహారం బాధితుడి కుటుంబానికి అందించి, కుటుంబానికి అండగా రాష్ట్ర ప్రభుత్వం ఉంటుందని భరోసా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మణిరత్నం,డాక్టర్ సురేష్ బాబు, జిందాము,జాకీర్,ముస్లిం మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మే 1 నుండి ఉచిత వేసవి బడి

హిందూపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 19: హిందూపురం పట్టణం త్యాగరాజ నగర్ లోగల మార్గదర్శి విద్యానికేతన్ పాఠశాల ఆవరణలో మే నెల 1 వ తేదీ నుంచి జూన్ నెల 1వ తేదీ వరకు ఉచిత వేసవి బడి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కె.సాయికళ-కె.మాళప్ప దంపతులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వస్తు రూపేణా దాతలు అందించు సాయంతో 27 సం.రాల నుండి ఉచిత వేసవి బడులు నిర్వహిస్తున్నామన్నారు. నిరక్షరాస్యత తగ్గించి బాల కార్మికవ్యవస్థ నిర్మూలనే ధ్యేయంగా 1999 యేడాది నుండి విద్యాభివద్ధికి కృషి చేస్తున్నట్లు వారన్నారు. కరాటే, కంప్యూటర్, యోగ, క్రీడలు, సంగీతం, నృత్యాలు, చిత్ర లేఖనం, చక్కని దస్తూరి తదితర విద్యలలో విలువలతో కూడిన శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. 6-14 సం.రాల చిన్నారులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం పరచుకోవాలని మరిన్ని వివరములకు సెల్ నంబర్ 9441144630 సంప్రదించాలని కె.సాయికళ-కె.మాళప్ప దంపతులు కోరారు.



### మాజీ మంత్రి వైసీపీనేత రోజాదిష్టి బొమ్మకి చొప్పుల మాలవేసి, .....
## దిష్టి బొమ్మ దగ్ధం చేసిన శ్రీకాళహస్తి జనసేన ఇంఛార్జి వినుత కోటా





శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 19: శ్రీకాళహస్తి మొన్న తిరుపతిలో మాజీ మంత్రి, వైసీపీ నేత రోజా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ ,వారి అబ్బాయిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ శనివారం శ్రీకాళహస్తి పట్టణం లోని పెళ్లి మండపం సెంటర్ లో జనసేన పార్టీ శ్రీకాళ హస్తి నియోజకవర్గ ఇన్చార్జి వినుత కోటా రోజా దిష్టి బొమ్మ కి చొప్పుల మాల వేసి, ప్యాకేజ్ అన్నందుకు రోజా దిష్టి బొమ్మ ని చొప్పు తో కొట్టి, దిష్టి బొమ్మ దగ్ధం చేసి నిర సన వ్యక్తం చేశారు.రోజా కబడ్దార్ అంటూ నినాదాలు చేశారు.జనసేన పార్టీ శ్రీకాళ హస్తి నియోజకవర్గ ఇన్చార్జి వినుత కోటా ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజాకినగిరి ప్రజలు బుద్ధి చెప్పినా ఇంకాబుద్ధి రాలేదని, నోటికి వచ్చినట్టు పవన్ కళ్యాణ్ గురించి పదేపదేవాగడం సరికాదని హెచ్చరించారు. రోజానిప్రజలు మరిచిపోయారని,ఎలాగైనా లైమ్ లైట్ లో ఉండడానికి ప్రయత్నిస్తూ ఇలాంటి చిల్లర మాటలు పవన్ కళ్యాణ్ ఉద్దేశించి చేస్తుందని మండి పడ్డారు. ఎంత ప్యాకేజ్ తీసుకుని పవన్ కళ్యాణ్ గురించి చిల్లరమాటలు మాట్లాడుతున్నావనిఎగ్దేవా చేశారు. ఇప్పటికీ దిష్టి బొమ్మ దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేస్తున్నానని, మరొక్క సారి పవన్ కళ్యాణ్ పైన నిరాధార ఆరోపణలు చేసి, చిల్లర గా మాట్లాడితే నగిరి లో రోజా ఇంటి ని ముట్టడించి అక్కడే బుద్ధి చెబు తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున వీర మహిళలు, నాయకులు కావలి శివకుమార్,పేట చంద్రశేఖర్,తోట గణేష్,చిన్న తోటి నాగరాజు,చంద్ర శేఖర్ రావు,లక్ష్మి,రాజ్య లక్ష్మి,నితీష్,వెంకట రమణ యాదవ్,లక్ష్మణ్ యాదవ్,శీను, వినోద్,లక్ష్మణ్, మహేష్,సురేష్, దుమ్ము, దినేష్ తదితరులు పెద్ద ఎత్తున నాయకులు,జనసైనికులు,వీర మహిళలు పాల్గొన్నారు.

### రాజ్యాంగ విరుద్ధమైన వాక్స్ సవరణ.....
## నల్ల చట్టానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం

శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 19: శ్రీకాళహస్తి పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ కూడలి దగ్గర అంబేద్కర్ విగ్రహానికి వద్ద జేఏసీ ఆధ్వర్యంలో నిరసన తెలియజేసిన వామపక్ష ప్రతిపక్ష పార్టీలు. దేశంలో ముస్లింలకు అన్యాయం చేసే వాక్స్ సవరణ చట్టాన్ని. నల్ల చట్టాన్ని రద్దు చేయాలి. ముస్లిం నాయకులు అంబేద్కర్ రాజ్యాన్ని గంగలో కలుపుతున్నారని దేశంలో ముస్లింలకు రక్షణ లేకుండా పోయే పరిస్థితి వస్తుందని ఇకనైనా దేశంలో ముస్లింలు దళితులు అంతా ఐక్యంగా నల్ల చట్టాల రద్దయి వరకు పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా మాజీ వాక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ సిరాజ్ భాష. శ్రీకాళహస్తి నియోజకవర్గం మైనార్టీ సెల్ అధ్యక్షులు పఠాన్ ఫరీద్ ఖాన్ పట్టణ అధ్యక్షులు మహబూబ్ బాషా గోరా. యాంటీ కరప్షన్ జిల్లా అధ్యక్షులు లాలు. మైనార్టీ నాయకులు షేక్ అస్లాం. లాల్ బాషా. మీర్జాన్ సా. షేక్ జూమ్లేష. ఆరిఫ్. సునీల్. షర్మిల ఠాగూర్. నేషనల్ ఫెడరేషన్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కామి వెంకటేశ్వర్లు. పసల



కిష్టయ్య. సిపిఎం సిపిఐ నాయకులు. పుల్లయ్య గంధపు మని గురవయ్య గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

### ఈవేస్ట్ తో పర్యావరణానికి ముప్పు....
## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేద్దాం
### స్వర్ణాంధ్ర...స్వచ్ఛ ఆంధ్ర మనందరి బాధ్యత- స్వచ్ఛ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే అమర్

పలమనేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 19:ఎలక్ట్రానిక్ పరికరాల వేస్ట్ తో పర్యావరణానికి పెను ముప్పని పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. పలమనేరు పురపాలక సంఘ కార్యాలయంలో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం పై అవగాహన కల్పిస్తూ నిర్వహించిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ప్లాస్టిక్ వ్యర్థాలతో పాటు ఎలక్ట్రానిక్ పరికరాల వ్యర్థాలతో పర్యావరణానికి తీరని నష్టం వాటిల్లుతుందని మానవాళి మనుగడకే ప్రశ్నర్థకంగా మారుతుందన్నారు. ఈ వేస్ట్ వ్యర్థలతో పర్యావరణ సమతుల్యత పూర్తిగా దెబ్బతినే ఆస్కారముందన్నారు. కాబట్టి ఈ వేస్ట్ వ్యర్థాలపై ప్రజల అవగాహన పెంచుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న



స్వర్ణాంధ్ర స్వచంద్ర కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వామ్యులు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి గంగమ్మ గుడి వీధి మీదుగా అవగాహన ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్వీ.రమణారెడ్డి,మెప్మా సిటీ మిషన్ మేనేజర్ బాబా,మున్సిపల్ సిబ్బంది తో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు ఆర్బీసీ కుట్టి, గిరిబాబు,సుబ్రహ్మణ్యం గౌడ్, నాగరాజు,ఖాజా పీర్, చాంద్ భాషా, బీ.ఆర్.సి కుమార్,లోకేష్ ఆచారి,నదీం, సురేష్, మురళీ, చందు తదితరులు ఉన్నారు.

## స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే





శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 19: శ్రీకాళహస్తి పట్టణంలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి అధికారులతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు, స్వచ్ఛ గ్రామాలు, స్వచ్ఛ నగరాల నిర్వహణతో చంద్రబాబు నాయుడు స్వచ్ఛ ఆంధ్ర కల సహకారం అవుతుందని,చెత్తను సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు చెత్తను తరలించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాశ్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు విజయకుమార్, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ రంగినేని చెంచయ్య నాయుడు, తదితర నాయకులు పాల్గొన్నారు.

## శ్రీరామలింగేశ్వర స్వామి కుంబాభిషేకం పై సమావేశం

కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 19: కుప్పం పట్టణం రాధాకృష్ణ రోడ్డులో నెలకొని ఉండు శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ కుంభాభిషేకం నిర్వహణపై కుప్పం. హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సుజ్ఞానంద ఆశ్రమంలో శనివారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. మే నెలలో శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ కుంభాభిషేకం నిర్వహణ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని సభ్యులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. 40 సంవత్సరాల శ్రీరాముని దేవాలయానికి జరుగుతున్న కుంభాభిషేకానికి ప్రతి ఒక్కరూ తమ వంతుగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సభ్యులు తెలిపారు. అదేవిధంగా హనుమాన్ శోభాయాత్ర సనాతన ధర్మం గొప్పతనాన్ని హిందువులు అర్థం చేసుకునే విధంగా ప్రణాళికలను సిద్ధం చేసి హిందూ ఐక్యతను చాటుకోవాల్సిన సమయం ఆసన్నమైందని అభిప్రాయపడ్డారు.



### స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న....
## ఏపీఎస్ఆర్టీసీ ఉపఅధ్యక్షులు పీఎస్ మునిరత్నం
### ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర శ్రీకాంత్



కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 19: కుప్పంమున్సిపాలిటీలో ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్ పరిధిలో ప్లాస్టిక్కు నిషేధిద్దాం .. పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం అనే కార్యక్రమంలో పాల్గొన్న ఏపీఎస్ఆర్టీసీ ఉపఅధ్యక్షులు పీఎస్ మునిరత్నం, ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్,



డాక్టర్ సురేష్ బాబు,తాసిల్దార్ ఆర్టీసీ డిపో మేనేజర్,రేషన్ డీలర్స్ అసోసియేషన్ సభ్యులు ప్లాస్టిక్కు నిషేధించడం ద్వారానే పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చునని స్థానిక నాయకులు,అధికారులతో కలిసి కాటన్ బ్యాగులను వినియోగించాలని ప్రజలకు సూచించిన ఏపీఎస్ఆర్టీసీ ఉపఅధ్యక్షులు పీఎస్ మునిరత్నం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్,ఈ కార్యక్రమంలో గోపీనాథ్,డాక్టర్ వెంకటేష్,కన్నన్,జిమ్ దాము,తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర
### చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 19: రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ నగరాలు...స్వచ్ఛ గ్రామాలు... స్వచ్ఛ ఆంధ్రా... స్వచ్ఛభారత్ లో భాగంగా ప్రతిష్టాత్మకంగా స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతి మాసం మూడో శనివారం ప్రతిష్టాత్మకంగా నిర్వహి స్తోంది.ఈ కార్యక్రమం లో భాగంగా ఏప్రిల్ మూడో శనివారం ఇ -చెక్ అనే థీమ్ తో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛంద కార్యక్రమంలో పాల్గొన్న




జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్,నగర మేయర్ అముద,చిత్తూరు శాసనసభ్యులు గురజా ల జగన్మోహన్,చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, నగర డిప్యూటీ మేయర్ చంద్ర శేఖర్,మాజీ ఎమ్మెల్సీ దొరబాబు,కమిషనర్ నరసింహ ప్రసాద్,ఎం హెచ్ ఓ డా.లోకేష్.. సంబంధిత అధికారులు.ఈ - వ్యర్థాల ప్రత్యేక నిర్వహణ కార్యక్రమంలో భాగంగా ఇండ్లు, హాస్పిటల్స్,ప్రభుత్వ కార్యాలయా లు,ప్రైవేట్ సంస్థల నుండి ఉత్పన్నమయ్యే కంప్యూటర్లు,టీవీలు,రేడియో,మొబైల్ ఫోన్ లు,వాషింగ్ మిషన్లు,మైక్రో ఓవెన్లు, సిడి ప్లేయర్లు,ఫ్యాన్లు మొదలగు వస్తువుల ను పర్యావరణ హితంగా నిర్వహించడం ద్వారా రీసైక్లింగ్ చేయడంపై అవగాహన ప్రదర్శనను నగరపాలక సంస్థ అధికారులు ఏర్పాటు చేశారు.ఈ- వ్యర్థాల ప్రత్యేక నిర్వ హణ కు సంబంధించిన ప్రదర్మన ను జిల్లా కలెక్టర్, నగర మేయర్ చిత్తూరు శాసనస భ్యులు చుడా చైర్ పర్సన్ లు పరిశీలించా రు.అనంతరం పారిశు ద్ధ్య కార్మికులకు ఉచితంగా సోపులు,కొబ్బరి నూనె బాటిల్స్ ను అతిథుల చేతుల మీదుగా అందజేశారు.

### శ్రీకాళహస్తీశ్వరున్ని దర్శించుకున్న .....
## తెలుగు సినిమా హీరోయిన్ సమంత

శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 19: శ్రీకాళహస్తి శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మవార్ల దర్శనార్థమై తెలుగు సినిమా హీరోయిన్ సమంత విచ్చేశారు. వీరికి శ్రీకాళహస్తి ఆలయ అధికారులు స్వాగతం పలికారు . శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానానికి తెలుగు చలనచిత్ర హీరోయిన్ నిర్మాత సమంత నిర్మాతగా మారి తొలి సినిమా ట్రాలల మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ పై నిర్మించిన తొలి సినిమా శుభం సినిమా సక్సెస్ అవ్వాలని శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానంలో ప్రత్యేక రాహు కేతు పూజ చేయించుకుని అనంతరం స్వామి అమ్మవార్ల ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం మేధా గురుదక్షిణామూర్తి సన్నిధానం వద్ద శేష వస్త్రంతో సత్కరించి వేదపండితులచే ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని,తీర్థప్రసాదాలను అందచేశారు . ఈ కార్యక్రమంలో దేవస్థానం ఏ.ఈఓ సతీష్ మాలిక్ ,ఏ.పీ.ఆర్.ఓ రవి , ఆలయ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## మున్సిపాలిటీ ఆవరణలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర, ఈ - వేస్ట్ సేకరణ కార్యక్రమంలో.....

### ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్




కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 19: కుప్పం మున్సిపాలిటీ ఆవరణలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర మరియు ఈ - వేస్ట్ సేకరణ కార్యక్రమంలో,శనివారం రోజు ప్రభుత్వ విప్,ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులు పి ఎస్ మునత్నం రాష్ట్ర విస్తరణ కమిటీ అధ్యక్షుడు బిఆర్ డాక్టర్ సురేష్ బాబు మునిసిపల్ ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, మైనార్టీ అధ్యక్షుడు జాకీర్, ఏఈ ఆంజనేయులు మాజీ సర్పంచ్ గోపీనాథ్ మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేష్ మున్సిపాలిటీ సిబ్బంది,తెలుగుదేశం, బిజెపి,జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నీటి సమస్యలను పరిష్కరించడానికి......

## బోర్వెల్ బండికి పూజ

### కుప్పం మున్సిపల్ పార్టీ అధ్యక్షులు రాజ్ కుమార్



కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 19: కుప్పం మున్సిపాలిటీ ఏడో వాడు గుట్టు కాలనీలో నీటి సమస్యలను పరిష్కరించ డానికి బోర్వెల్ బండికి పూజ చేయటానికి మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఆదేశానుసారం కుప్పం మున్సిపల్ పార్టీ అధ్యక్షులు రాజ్ కుమార్, 10వ క్లస్టర్ ప్రతాప్ 11వ క్లస్టర్ రవి, మున్సిపల్ ఉపాధ్యక్షులు ఆర్ముగం యూనిట్ ఇన్చార్జి మాణిక్యం, అంబేద్కర్ యువ అధ్యక్షులు గోపి, భూత్ ఇంచార్జ్ కమలేష్ ఏడవ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి రాజేష్, కుప్పం మున్సిపల్ ఎస్సీ సెల్ అధ్యక్షులు క్రాంతి కుమార్, అంజాద్ బాషా,మరియు స్థానిక మహిళలు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

### చెక్కునత్తం పంచాయతీ లో స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివాస్.....

## కార్యక్రమంలో పాల్గొన్న చెక్కునత్తం మణి,




కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఏప్రిల్ 19: కుప్పం మండలం చెక్కునత్తం పంచాయతీ లో స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు చెక్కునత్తం మణి,పార్టీ అధ్యక్షులు మునిరత్నం,రామప్ప, పంచాయతీ కార్యదర్శి మురళి, రవి, కృష్ణప్ప, మాదేశ్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.?

## రోజాకు జనసేన వార్నింగ్

తిరుపతి : తిరుమల గోశాల వివాదం రచ్చ రచ్చ అవుతోంది. గోవుల మరణాలపై వైసీపీ వర్సెస్ టీడీపీ యుద్ధమే జరుగుతోంది. భూమనకు మద్దతుగా గురువారం రోజా ఎంట్రీ ఇచ్చారు. అయితే, టీటీడీనో, టీడీపీనో విమర్శించకుండా పవన్ కల్యాణ్‌పైనే ఎక్కువగా అటాక్ చేస్తూ మైండ్ గేమ్ ఆడారు ఆర్కే రోజా. సనాతన ధర్మాన్ని కాపాడుతానని చెబుతున్న పవన్ కల్యాణే.. టీటీడీ అరాచకాలు, గోవుల మృతిపై సమాధానం చెప్పాలని నిలదీశారు. తిరుమల వెంకన్నతో పెట్టుకుంటే ఎవరికీ పుట్టగతులు ఉండవని.. పవన్‌కు కూడా ఇటీవలే ఈ విషయం అనుభవంలోకి వచ్చిందంటూ.. పరోక్షంగా మార్క్ శంకర్ ఘటనను ప్రస్తావిస్తూ కాంట్రవర్సీ కామెంట్స్ చేశారు.తమ సేనానిని రోజా అన్నేసి మాటలు అంటుంటే జనసైనికులు ఊరుకుంటారా? ఆ పార్టీ సీనియర్ లీడర్ బొలిశెట్టి సత్యనారాయణ, జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్‌లు రంగంలోకి దిగారు. రోజాకు అర్థమయ్యే భాషలోనే ఘాటైన విమర్శలు చేశారు. గోశాల ఘటనపై భూమన కరుణాకర్‌రెడ్డి డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు.కరుణాకర్‌రెడ్డి హారతి డ్రామా ఆడారని.. ఇప్పుడు గోవుల డ్రామా ఆడుతున్నారని జనసేన నేత బొలిశెట్టి సత్యనారాయణ మండిపడ్డారు. భూమాన వలన తిరుమల ప్రతిష్ఠ దిగజారిందన్నారు. గోశాలకు వెళ్లనివ్వడం లేదని కరుణాకర్ రెడ్డి అనడం పచ్చి అబద్ధమన్నారు. ఇక, రోజాను మాటలతో చెడుగుడు ఆడుకున్నారు బొలిశెట్టి. ఆర్కే రోజా.. ఆడా, మగా, హిజ్రా కూడా కాని.. నాల్గవ జాతికి చెందిన వ్యక్తి అంటూ ఫైర్ అయ్యారు. రోజా గతంలో దర్శనం టికెట్లు బ్లాక్‌లో అమ్ముకొని కోట్లు గడించారని విమర్శించారు. ఇప్పుడా దందా ఆగిపోవడంతో.. తిరుమలపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.జనసేన విశాఖ కార్పొరేటర్, ఫైర్ బ్రాండ్ లీడర్.. మూర్తియాదవ్ మరింత రెచ్చిపోయారు. టీటీడీ చైర్మన్‌గా కరుణాకర్‌రెడ్డి కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల కొండపై అన్యమత ప్రచారానికి ఒడిగట్టారని విమర్శించారు. ఇప్పుడు గోశాల వివాదం తీసుకువచ్చి తిరుమల పవిత్రతను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.రోజా.. చిత్తూరు చిత్రాంగి అని.. ఐరన్ లెగ్ లేడీ అంటూ మండిపడ్డారు మూర్తి యాదవ్. రోజా తన ఐరన్ లెగ్‌తో వైజాగ్ ఋషికొండ ప్యాలెస్‌కు గృహ ప్రవేశం చేశారని.. అది ఇప్పటికీ అలాగే ఉండిపోయిందని ఎద్దేవా చేశారు.

## శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి రథోత్సవం లో.....

# పాల్గొన్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్





శాంతిపురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 19: కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం కెనమాకులపల్లి గ్రామంలో నెలకొనియుండు శ్రీ లక్ష్మీ నారాయణస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రోజు రథోత్సవ కార్యక్రమం నిర్వహించారు ఈ రథోత్సవాన్ని పూలమాలలతో అతివైభవంగా అలంకరణ చేసి కెనమాకులపల్లి పురవిధులలో శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి రథోత్సవాన్ని భక్తులు మూడు రాష్ట్రాలు ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు, నుండి వేలాదిమంది తరలివచ్చి హిందూ సంప్రదాయనీ అనుసరించి తెల్లని దుస్తులు ధరించి కెనమాకులపల్లి పురవీధులలో రథోత్సవాన్ని లాగారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం విచ్చేశారు శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయం నందు అర్చన కార్యక్రమం లో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పాల్గొని అనంతరం రథోత్సవాన్ని లాగారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు విశ్వనాథ్ నాయుడు, మాజీ ఎంపీపీ నందిగామ ఉదయ్ కుమార్, కుప్పం నియోజకవర్గం బీసీ సెల్ ఉపాధ్యక్షులు ఈడుగా రమేష్, మాజీ ఎ ఏం సి యు వైస్ చైర్మన్ ఆర్ఎస్ నాగరాజు, కెనమాకులపల్లి సర్పంచ్ అభ్యర్థి ఎన్ పి శివకుమార్ , రాధాకృష్ణ, కోదండ నాయుడు, చంద్ర, పెద్దన్న, ఆంజనేయ రెడ్డి, వెంకటాచలపతి, మణి ,మహిళా కార్యకర్తలు సుగుణమ్మ, రూప, శ్యామలమ్మ, కెనమాకులపల్లి గద్దూరు గ్రామస్తులు ఆలయ అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

## ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ విద్యను ......

# ప్రారంభించేందుకు విశ్వవిద్యాలయ అధికారులు కసరత్తు



గుడిపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 19: కుప్పం నియోజకవర్గం గుడిపల్లి మండలంలోని ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ విద్యను ప్రారంభించేందుకు విశ్వవిద్యాలయ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా ఈరోజు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఇద్దరితో కూడిన కమిటీ సభ్యులు ఆచార్య పి. వెంకటకృష్ణ, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మరియు ఆచార్య ఎం. రాజశేఖర్ బాబు, విట్ విశ్వవిద్యాలయం, వేలూరు, వీరి ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయంలోని భవనాలను, వసతులను సందర్శించి ఈ విద్యా సంవత్సరం నుంచి కంప్యూటర్ సైన్స్ మరియు కంప్యూటర్ సైన్స్ విత్ మిషన్ లెర్నింగ్ ఈ రెండు విభాగాలకు సంబంధించిన ఇంజనీరింగ్ విద్యను ప్రారంభించుటకు నివేదికను తయారుచేసి విశ్వవిద్యాలయ అధికారులకు సమర్పించడం జరిగింది.

## డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ...

# ఘనంగా వీడ్కోలు కళాశాల వార్షికోత్సవ వేడుకలు




వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 19: డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా వీడ్కోలు మరియు కళాశాల వార్షికోత్సవ వేడుకలు కళాశాల ప్రాంగణంలో ఉత్సాహంగా జరిగింది.ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతా విజయులురెడ్డి మరియు తిరుమల తిరుపతి దేవస్థానం రిటైర్డ్ ఏఈ శ్రీ జి.వి. మునికృష్ణయ్య హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. అన్నపూర్ణ శారద వారిని సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాల వార్షిక నివేదికను చదివి వినిపించారు. అనంతరం ముఖ్య అతిథులు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. డాక్టర్ విజయులురెడ్డి విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి మంచి భవిష్యత్తును సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. శ్రీ జి.వి. మునికృష్ణయ్య విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు.అనంతరం విద్యాపరంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, సాహిత్య మరియు సాంస్కృతిక కార్యక్రమాలలో విజేతలుగా నిలిచిన వారికి, క్రీడలు మరియు ఆటలలో ప్రతిభ చూపిన వారికి ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.ఈ వేడుకలో భాగంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. నృత్యాలు, పాటలు, నాటికలు వంటి వివిధ ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బందితో పాటు దాదాపు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందరి సమష్టి కృషితో ఈ వేడుక ఎంతో విజయవంతంగా ముగిసింది. విద్యార్థులు తమ సీనియర్లకు వీడ్కోలు పలుకుతూ భావోద్వేగంతో కనిపించారు.

### ప్రజా సమస్యలు పరిష్కారమే ......

## ధ్యేయంగా చంద్రన్న ప్రభుత్వం





వరదయ్యపాలెం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 19: బుచ్చినాయుడు కండ్రిగ లో ఆందోళన కారుల దీక్ష విరమింపజేశిన ఎమ్మెల్యే అర్హు లైన ప్రతి ఒక్కరికి ఇంటి పట్టాలు పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే హామీ వరదయ్యపాలెం లో ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారం భోత్సవం లో ఎమ్మెల్యే రెండు మండలాల్లో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన.ప్రజాసమస్యలు పరి ష్కారమే ధ్యేయంగా నారా చంద్రబాబు నాయుడు ,ప్రభుత్వం పనిచేస్తుంద ని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. శనివారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వరదయ్యపాలెం, బుచ్చినాయుడు కండ్రిగ మండలాలలో సుడిగాలి పర్యటన చేసి అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలలో పాల్గొన డం తో పాటు 39 రోజులుగా ఆందోళన చేస్తున్న ప్రజల సమస్యలు పరిష్కారానికి ఎమ్మెల్యే ఆదిమూలం చొరవ చూపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు బుచ్చి నాయు డు కండ్రిగ తహశీల్దారు కార్యాలయం వద్ద కనవనంబేడు లో ఆక్రమణలో ఉన్న ప్రభు త్వ భూములను స్వాధీనం చేసుకొని తమ కు ఇంటి పట్టాలు ఇవ్వాలని కోరుతూ గత 39 రోజులుగా రిలే నిరాహారదీక్షలు చేస్తు న్న వారిని ఎమ్మెల్యే పరామర్శించారు. ఆందోళనకారుల సమస్యలను సావధానం గా విన్న ఎమ్మెల్యే వెంటనే తహశీల్దారు శ్రీదేవి తో చర్చించి,అర్హులైన ప్రతి కుటుంబా నికి ఇంటి పట్టాలు పంపిణీ చేయడంతో పాటు ప్రభుత్వం ద్వారా పక్కాఇల్లు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే హామీ తో సంతృప్తి చెందిన ఆందో ళనకారులు తమ దీక్ష విరమణకు అంగీక రించారు. వెంటనే వారికి మజ్జి అందించి దీక్షను విరమింప జేశారు.అంతకు ముందు ఉదయం 10 గంటలకు వరదయ్యపాలెం లోని నైస్ స్కూల్ వద్ద స్విమ్స్ వైద్యుల వారిచే నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఎమ్మె ల్యే ప్రారంభించారు. అక్కడ నుండి వరద య్యపాలెం ఆర్టీసీ బస్టాండ్ వద్దకు ఎమ్మె ల్యే చేరుకొని సత్యవేడు నుండి (వయా సంత వేలూరు)సూళ్లూరుపేట వరకు ఆర్టీసీ బస్సు సర్వీసును జెండా ఊపి ఎమ్మెల్యే ప్రారంభించడంతో పాటు బస్సు ఎక్కి తొలి టికెట్టు కొని కొంత దూరం ప్రయాణించి అందరినీ ఉత్సాహ పరిచారు.తదుపరి ప్రభుత్వం మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర ర్యాలీలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు.అనంతరం వరద య్యపాలెం మండలం నెల్లాటూరులో జరిగే ఆలయ మహాకుంభాభిషేకంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మె ల్యే కు తీర్థప్రసాదాలు అందించిఆశీర్వచనా లు పలికారు.ఈ కార్యక్రమంలో అధికారు లు, ప్రజాప్రతినిధులు తెలుగుదేశం, జనసే న, బిజెపి పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏపీకి గేమ్ ఛేంజర్ ప్రాజెక్ట్...

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మరో భారీ ప్రాజెక్టు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే గ్రీన్ ఎనర్జీ రంగంలో ఏపీకి కొన్ని కీలక పెట్టుబడులు వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరో భారీ ప్రాజెక్టు కూడా ఏపీకి వస్తుందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మైనింగ్ సంస్థ అయిన రియో టింటో.. గురువారం భారత్‌కు చెందిన ఏఎంజీ మెటల్స్ అండ్ మెటీరియల్స్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. మన దేశంలో లోకార్బన్ అల్యూమినియం ప్రాజెక్టు ఏర్పాటు కోసం ఈ ఎంవోయూ జరిగినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

# గొప్ప పరిపాలనాదక్షుడు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

### తెలుగు ఉమ్మడి రాష్ట్రాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి ఎనలేనిది..

### సుదీర్ఘ కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన అరుదైన గౌరవం బాబు సొంతం..

### దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించిన మేటి రాజకీయ వేత్త చంద్రన్న...

### తెలుగు రాష్ట్రాల ప్రగతిని ప్రపంచానికి పరిచయం చేసిన తెలుగు జాతి ముద్దు బిడ్డ...

### ముఖ్యమంత్రి చంద్రబాబుకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేసిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు...

చిత్తూరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఏప్రిల్ 19: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గొప్ప పరిపాలనా దక్షుడు అని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు ఓ ప్రకటనలో కొనియాడారు. తెలుగు ఉమ్మడి రాష్ట్రాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి ఎనలేనిది అన్నారు. దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించిన మేటి రాజకీయ వేత్త చంద్రబాబు నాయుడు అని ప్రశంసించారు. సుదీర్ఘ కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన అరుదైన గౌరవం బాబు సొంతమన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు 75 వ పుట్టిన రోజు నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల ప్రగతిని ప్రపంచానికి పరిచయం చేసిన తెలుగు జాతి ముద్దు బిడ్డ.., రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుకి శనివారం ముందస్తుగా పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు...సామాన్య రైతు కుటుంబంలో పుట్టి అంచలంచెలుగా ఎదుగుతూ.. విలువలు కలిగిన రాజకీయ వేత్తగా...తెలుగు రాష్ట్రాలకు ముఖ్య మంత్రిగా పనిచేసి.., తెలుగు ప్రజల అభ్యున్నత కోసం పరితపించిన ప్రజా ప్రతినిధి,పాలనాదక్షుడు నారా చంద్రబాబు నాయుడు అని, ఆయన స్ఫూర్తితోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారాయన. అభివృద్ధికి మారు పేరు చంద్రబాబు నాయుడు అని.., ఆయన తీసుకొచ్చిన సంస్కరణలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సర్వతో ముఖాభివృద్ధికి బాటలు వేసాయన్నారు. ప్రస్తుతం స్వర్ణాంధ్ర అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న నిత్య కృషీవలుడన్నారు. ముఖ్యమంత్రిగా తెలుగు దేశం పార్టీ అధినేతగా.,ప్రజాసేవకు డిగా... ఆయన అందిస్తున్న సేవలు నిరుపమానమన్నారు.ఆధునిక యుగానికి చంద్రన్నను రోల్ మోడల్ గా నిలిపాయని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు అభినందించారు. చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా మరోసారి ఏపీ సీఎం చంద్రబాబుకు చిత్తూరు ఎంపి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరిన్ని జరుపుకోవాలని, ఆంధ్రప్రదేశ్ను సర్వతో ముఖాభివృద్ధి వైపు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.



OWNER AND PUBLISHED BY DAMA VIJAYAKUMAR, PRINTED AT VIJAY PUBLISHERS AND PRINTERS
D.No. 1-176, ANJUR Village & Post, K.V.B.PURAM Mandal, PIN:517643, Thirupati District A.P. Mobile: 9440352036